సాక్షి ఒడిశా

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,31,956

బంగారం 14 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రాష్ట్రంలో పీఎం మోదీ పర్యటన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు శనివారం విచ్చేశారు.

- 8లో



హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ శరణ్ సింగ్

ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ నియమితులయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

పేదలకు చీరలు పంపిణీ



పేదలకు చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాయి మందిరం ప్రాంగణంలో పేదలకు చీరలను శనివారం పంపిణీ చేశారు. ఆ క్లబ్ అధ్యక్షురాలు కోరాడ రజిత ఆధ్వర్యంలో వంద మంది వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ క్యాబినేట్ కార్యదర్శి సుజాత పాలో, ఉపాధ్యక్షురాలు సర్మిష్ట పాడి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం



కుక్క కాటుకు గురైన వ్యక్తికి ఇంజక్షన్ ఇస్తున్న నర్సు

జయపురం: బొరిగుమ్మలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల కనబడినవారిపై దాడి చేస్తూ దాదాపు 27 మందిని గాయపరిచాయి. అలాగే శనివారం సైతం పలువురిని గాయపరిచాయి. దీంతో వారికి బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. అయితే కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హత్య కేసు నిందితుడు అరెస్టు

బరంపురం: గంజాం జిల్లాలోని దిగపండి పోలీసుస్టేషన్ పరిధిలో 2017లో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి దీప్తి రంజన్ బెహరా తెలిపిన వివరాల మేరకు.. దిగపండి పోలీసుస్టేషన్ పరిధి సన్నో కొరంజి గ్రామంలో నిరంజన్ మల్లిక్ హత్య జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్నటువంటి నిందితుడు సోమనాథ్ మల్లిక్‌ని 7 ఏళ్ల తర్వాత శుక్రవారం అరెస్టు చేశారు. బెంగులూరులో అరెస్టు చేసి దిగపండి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు.

పాఠశాలలో వాచ్‌మెన్ ఆత్మహత్య



గంగబాబు మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి కేంద్రంలో ఉన్నటువంటి పాఠశాలలో పని చేస్తున్న నైట్ వాచ్‌మెన్ కోరాపు గంగబాబు (40) పాఠశాల స్టాఫ్ రూమ్‌లో ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. గంగాబాబు పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం పాఠశాల నుంచి అందరూ వెళ్లిపోయాక రాత్రి విధులకు హాజరయ్యాడు. అయితే శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు స్టాఫ్ రూమ్ తెరిచేందుకు ప్రయత్నించగా మూసి ఉంది. దీంతో కిటికీలో నుంచి చూడగా గంగబాబు ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. వెంటనే పోడియా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పాఠశాలకు వచ్చి తలుపులు పగలుగొట్టి, మృతదేహాన్ని కిందికి దించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి పోస్టుమార్టం కోసం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు అనేది తెలియడం లేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమ్మేళనానికి విచ్చేసిన అతిథులకు అభివాదం చేస్తున్న సీఎం నవీన్



భాషయే భవిష్యత్ నినాదంతో సదస్సు ప్రాంగణం వద్ద రూపుదిద్దుకున్న సైకత శిల్పం

మన భాషే.. మన గుర్తింపు

- భాష ఐక్యతకు గొప్ప మంత్రం
- సీఎం నవీన్ పట్నాయక్
- వైభవంగా ప్రారంభమైన ప్రపంచ ఒడియా భాష సదస్సు



మాట్లాడుతున్న మంత్రి అశ్వినీ కుమార్ పాత్రో



ప్రసంగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ప్రపంచంలో ఎక్కడైనా మన భాషే.. మనకు గుర్తింపునిస్తుందని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. స్థానిక జనతా మైదానంలో ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సును శనివారం ఆయన ఘనంగా ప్రారంభించారు. వందే ఉత్కళ జనని రాష్ట్ర గీతాన్ని ఆలపిస్తూ రాష్ట్ర, విదేశాల్లోని ఒడియా భాషాప్రియులు ఈ ఉత్సవంలో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మేళనం తీర్మానాలను ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక భాషా విధానాన్ని రూపొందిస్తుందని సీఎం ప్రకటించారు. భాష అనేది ఐక్యతకు గొప్ప మంత్రమని పేర్కొన్నారు. ఈరోజు మన జాతికి, భాషకు కీర్తి దినమని తెలియజేశారు. భాష కోసం ఒడిశా మొత్తం ఒక్కటైందని ఆనందం వ్యక్తం చేశారు. భాష చరిత్రను తెలుసుకుని, వర్తమానాన్ని పరిశీలించి భావితరాలకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కవయిత్రి నరళా దాస్‌కు నివాళులర్పించిన ఆయన ఒడియా భాషా వైభవాన్ని పెంచిన రచయితలు, కవులందరికీ స్వాగతం పలికారు. దేశ,



రాష్ట్ర గీతాలాపనలో పాల్గొన్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తదితరులు

విదేశాల్లోని ప్రముఖ భాషావేత్తలతో పాటు రచయితలు, సాహితీ పరిశోధకులు, చరిత్రకారులు, సాంస్కృతిక నిపుణులు ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొన్నారు.

4 దేశాల నుంచి 100 మంది

ఒడియా భాషా, సాహిత్యం, సాంస్కృతిక శాఖ మంత్రి అశ్విని కుమార్ పాత్రో మాట్లాడుతూ ఈ సదస్సుకు 4 దేశాల నుంచి 100 మందికి పైగా వం



కిటకిటలాడుతున్న జనతా మైదానం

డితులు, భాషావేత్తలు తరలివచ్చారని తెలియజేశారు. అతిథుల్లో ఒకరైన ఆగ్నేయ ఆసియా స్టడీస్ ప్రొఫెసర్ ఆర్లో గ్రిఫిత్ మాట్లాడుతూ నేను ఒడిశాలో నివసిస్తున్నాను. భారతదేశంలో ఒడిశా అంటే నాకు చాలా ఇష్టం. నేను జగన్నాథ్, ఒడియా భాషని ప్రేమిస్తున్నాను, ఒడియా భాషను ఉపయోగిస్తానని తెలిపారు. భాషా విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి సెక్రటరీ సుజాతా రౌత్ కార్తికేయన్ స్వాగతోపన్యాసం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా ప్రథమ విశ్వ ఒడియా భాషా సమ్మేళనానికి హాజరయ్యారు.



భాషా సమ్మేళనానికి హాజరైన భాషాప్రియులు



డాక్టర్ ప్రతిభా రేను సత్కరిస్తున్న సీఎం నవీన్



డాక్టర్ సీతాకాంత్ మహాపాత్రోకు ముఖ్యమంత్రి సత్కారం



జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న డాక్టర్ దేవిప్రసన్న పట్నాయక్

దేవిప్రసన్నకు జీవన సాఫల్య పురస్కారం

ప్రపంచ ఒడియా భాషా సమ్మేళనం జీవన సాఫల్య భాషా పురస్కారం ప్రముఖ భాషావేత్త, పద్మశ్రీ డాక్టర్ దేవిప్రసన్న పట్నాయక్‌కు లభించింది. ఒడియా భాషా వ్యాప్తికి విశేష కృషి చేసినందుకు ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయడం విశేషం. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆయనకు ఈ అవార్డును అందజేశారు. అవార్డుకు సంబంధించి ఆయనకు రూ.20 లక్షల నగదు పురస్కారంతో పాటు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవిప్రసన్న మాట్లాడుతూ.. అవార్డు రావడం తనకు గొప్ప వరమన్నారు. ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి కోసం కృషికి సొంత గడ్డపై ఈ గుర్తింపు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతలు డాక్టర్ ప్రతిభా రే, డాక్టర్ సీతాకాంత్ మహాపాత్రోలను సత్కరించారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడులు



రైతులకు వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు



కిసాన్ మేళాకు హాజరైన రైతులు

పర్లాకిమిడి: వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ, సాంకేతికతతో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ సహాయ అధికారి శిశిర్ కుమార్ బిసాయి అన్నారు. గుసాని సమితి ఉప్పలాడ గ్రామంలో సెంచూరియన్ వర్సిటీ ఆధ్వర్యంలో మినీ కిసాన్ మేళాను శనివారం నిర్వహించారు. ఈ మేళాలో ఎం.ఎస్.స్వామినాథన్ అగ్రికల్చర్ కళాశాల బీఎస్సీ నాల్గో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. మేళాలో ట్రాక్టర్లు, దుక్కి దున్నే యంత్రాలు, ట్రస్పర్ యంత్రాలు తదితర వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించారు. సేంద్రీయ స్మార్ట్ యాంత్రీకరణతో రైతులు లాభదాయకమైన పంటలు వేయవచ్చని విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో ఉప్పలాడ సర్పంచ్ డి.త్రివేణి, సెంచూరియన్ అగ్రికల్చర్ డీన్ ప్రొఫెసర్ డి.దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ



పుటేజీలో చిక్కిన నిందితుడు

బరంపురం: గంజాం జిల్లా కవిసుర్యానగర్ పోలీసుస్టేషన్ పరిధి కలిమాలి గ్రామంలోని మద్యం దుకాణంలో శనివారం తెల్లవారుజామున చోరీ ఘటన చోటుచేసుకుంది. దీనిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇసుక లోడుతో వెళ్తున్న ట్రక్కు బోల్తా

జయపురం:

సమితి పరిధి బరిణిపుట్ సమీపంలో ఇసుక ట్రక్కు బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. జయపురం నుంచి కొరాపుట్ వైపు వెళ్తున్న ఒక ఇసుక లోడు ట్రక్కు బరిణిపుట్ సమీపంలోని ఘాట్ రోడ్డు టర్నింగ్‌లో అదుపు తప్పింది. దీంతో ట్రక్కులో ఉన్న ఇసుక రోడ్డుపై పడింది. అదే సమయంలో ట్రక్కు అదే రోడ్డుపై వస్తున్నటువంటి కారుపై బోల్తాపడింది. దీంతో కారులో డ్రైవర్ ఇరుక్కుపోయాడు. వెంటనే స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని కారులో డ్రైవర్‌ను బయటకు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికంగా ఉన్నటువంటి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. ట్రక్కు డ్రైవర్ పరారయ్యాడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలియజేశారు.



బోల్తాపడిన ట్రక్కు

ముగిసిన పుష్ పుని వేడుకలు



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం



ముగింపు వేడుకల్లో పాల్గొన్న కమల పూజారి, గోవర్ధన పానికలు



వేడుకలు తిలకించేందుకు వచ్చిన ప్రజలు

జయపురం: పట్టణంలో వారం రోజులుగా జరుగుతున్న పుష్ పుని వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో జిల్లాలో పద్మశ్రీ అవార్డులు అందుకున్న కమల పూజారి, గోవర్ధన పానికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. పుష్ పుని వేడుక ప్రాధాన్యతను వివరించారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు, కళలను పరిరక్షించుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది పండగను నిర్వహిస్తూ ఆదివాసీ సంస్కృతిని పరిరక్షిస్తున్న కొరాపుట్ జిల్లా కొరాపుటియ కళాకారుల కృషి అభినందనీయమన్నారు. అనంతరం కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో పుష్‌పుని వేడుకల నిర్వాహక కమిటీ సాధారణ కార్యదర్శి ధీరెన్ మోహన పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కంటితో ప్రదీప్ మాఝి భేటీ



నెక్కంటితో మాట్లాడుతున్న ప్రదీప్ మాఝి, పక్కనే అనసూయా మాఝి

రాయగడ: రాష్ట్ర ప్రత్యేక ప్రణాళిక మండలి ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావుతో శుక్రవారం భేటీ అయ్యారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన ప్రదీప్, అనంతరం స్థానిక రాణిగుడ ఫారంలోని నెక్కంటి నివాసానికి వెళ్లి కలిశారు. ఆయన వెంట ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి ఉన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత కీలకమైన రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ తరుపున పోటీ చేసేందుకు ఎవరికి టిక్కెట్టు లభిస్తుందోనన్న తరుణంలో వీరు భేటీ అవ్వడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

టికెట్టు సిఫార్సు కోసమా..?

జిల్లాలో రాయగడ, గుణుపూర్, బిసంకటక్ శాసన సభలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానం ఉంది. 2019లో జరిగిన ఎన్నికల్లో అధికార బీజేడీ పార్టీకి చెందిన అభ్యర్థులు బిసంకటక్, గుణుపూర్ శాసన సభల్లో విజయాన్ని కైవసం చేసుకోగా, రాయగడ శాసనసభ స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. అయితే ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైన రాయగడ శాసనసభ స్థానాన్ని బీజేడీ కైవసం చేసుకునేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ స్థానం నుంచి బీజేడీ టిక్కెట్టు సంపాదించేందుకు ఒకవైపు జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల, మాజీ మంత్రి లాల్‌బిహారి హిమిరిక, అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థిగా గెలిపొందిన మకరంద ముదలిల సైతం ప్రయత్నాలు చేస్తున్నారు. అదే తరహా టిక్కెట్టు కోసం పోటీ పరుగులో ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రదీప్ మాఝి నెక్కంటితో భేటీ అయ్యేందుకు తనతో అనసూయా మాఝిని తీసుకువెళ్లడంతో ఆమెకు టిక్కెట్టు విషయంలో సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. అత్యంత కీలకంగా గుర్తింపు పొందిన రాయగడ శాసనసభ టిక్కెట్టు పొందాలంటే అందుకు నెక్కంటి కరుణా కటాక్షాలు తప్పకుండా ఉండాలన్న వార్తలకు ప్రదీప్ మాఝి భేటీ చూస్తే మరింత బలం చేకూరింది. అయితే పార్టీ నాయకుడిగా తనతో ప్రదీప్ భేటీ అయ్యారే తప్పా మరో ఉద్దేశంతో కాదని నెక్కంటి వచ్చిన వార్తలను కొట్టిపారేశారు.

క్లుప్తంగా

ట్రాక్ పాడిగింపునకు రూ.50 కోట్లు


పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులు

పర్లాకిమిడి: కేంద్ర రైల్వే బడ్జెట్‌లో నౌపడా–గుణుపురం నుంచి తెరుబలి సంప్రసారణకు 79 కిలోమీటర్ల ట్రాక్ పాడిగింపునకు రూ.50 కోట్లు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ కేటాయించారు. ఈ కొత్త లైనును ఎప్పటినుంచో ఈ ప్రాంతపు ప్రజలు కోరుతున్నారు. రాయగడ, రాయ్‌పూర్ స్టేషన్ (ఛత్తీస్‌ఘడ్)కు తక్కువ సమయంలో చేరుకోవచ్చని ఆశిస్తున్నారు. దీంతోపాటు గుణుపురం, పర్లాకిమిడి వ్యాపారులు రాయ్‌పూర్ నుంచి టోకు వ్యాపారం చేసుకునే వీలుంటుందని అంటున్నారు. ప్రస్తుతం గుణుపురం, పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. గుణుపురంలో స్టాఫ్ కాంప్లెక్స్, ట్రాక్స్ మధ్య వాటర్ సప్లయ్, ప్లాట్ ఫారం పనులు పర్లాకిమిడి స్టేషన్ కంటే జోరుగా సాగుతున్నాయి.

తంపర తీరంలో స్వచ్ఛ భారత్

బరంపురం: గంజాం జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని పర్యాటక కేంద్రంగా నిలిచిన తంపర తీరంలో శనివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఛత్రపూర్‌లో ఎన్ఏసీ పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో నుబుద వాని సహకారంతో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరుగుతుండడంతో ఇటువంటి కార్యక్రమం చేపట్టినట్లు తెలియజేశారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శరణ్ సింగ్


జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్

భువనేశ్వర్: ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ప్రధాన న్యాయమూర్తి పదవీ కాలం పరిగణిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన కలెక్టర్, నగర కమిషనర్


మంత్రిని కలిసిన కలెక్టర్ కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం రూరల్: రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో తలపెట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలు


తలకు గాయమై రక్తస్రావంతో పడి ఉన్న పవన్‌కుమార్

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న పాతబ్రిడ్జి వద్ద శనివారం ఓ యువకుడు బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ చెప్పిన వివరాల మేరకు.. కలెక్టర్ బంగ్లా సమీపంలోని రాధాకృష్ణ నగర్‌లో వనుము అచ్చన్నడు తన భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తెతో కలిసి జీవిస్తున్నాడు. అచ్చన్నడు చిన్నకుమారుడు పవన్‌కుమార్(30) నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. శనివారం నాగావళి నది పాత బ్రిడ్జి మీదుగా తన స్కూటీతో ఇంటికి వస్తుండగా బండి స్కిడ్ అయ్యి కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. దీంతో స్థానికులు ఆయనను 108లో రిమ్స్‌కు తరలించారు. ఆయన తండ్రి అచ్చన్నడుకు సమాచారం అందజేశారు. పవన్ అపస్మారక స్థితిలో ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నగరంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జన గళమున 'వందే ఉత్కల జననీ'


భువనేశ్వర్: ప్రత్యేక వేషధారణలో రాష్ట్రగీతం ఆలపిస్తున్న దృశ్యం

- రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర గీతాలాపన

ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సమ్మేళనం పురస్కరించుకుని వందే ఉత్కళ జనని ఆలాపనతో రాష్ట్రం మారుమోగింది. భాషాభిమానులు, భాషా ప్రియులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాష్ట్ర గీతం ఆలపించడానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. పాఠశాలలు, కాలేజీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భాషా ప్రాధాన్యత, పరిరక్షణ కోసం విద్యార్థులకు వివరించారు. పలుచోట్ల భాష ప్రాధాన్యతపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


జయపురం: సమితి కార్యాలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం


పర్లాకిమిడి: ఒడియా భాష పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్


జయపురం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో వందే ఉత్కల జననీ ఆలాపన



మల్కన్‌గిరి: ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు


జయపురం: భాషా మహోత్సవాల వాహనం ప్రారంభిస్తున్న నరేంద్ర కుమార్ మహంతి తదితరులు


రాయగడ: గాంధీ పార్క్ వద్ద గీతాలాపనలో మంత్రి సరక, కలెక్టర్ తదితరులు


పర్లాకిమిడి: మాట్లాడుతున్న పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి


పర్లాకిమిడి: ఒడియా భాషలో సంతకం చేస్తున్న అదనపు కలెక్టర్ జీరేంద్రకుమార్ దాస్


రాయగడ: కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో వందే ఉత్కళ జననీ ఆలపనలో పాల్గొన్న అధికారులు

రాష్ట్రంలో పీఎం మోదీ పర్యటన

- పలు ప్రాజెక్టులు ప్రారంభం
- కొత్త పనులకు శంకుస్థాపనలు


పీఎం మోదీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ రఘుబర దాస్, సీఎం నవీన్ పట్నాయక్ తదితరులు


సంబల్‌పూర్ ఐఐఎం శాశ్వత క్యాంపస్ సముదాయం ప్రారంభిస్తున్న పీఎం మోదీ

భువనేశ్వర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు శనివారం విచ్చేశారు. దీనిలో భాగంగా పలు ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అలాగే మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో సహజ వాయువు, బొగ్గు, విద్యుత్ ఉత్పత్తితో కూడిన ఇంధన రంగాన్ని పెంచే లక్ష్యంతో సంబల్‌పూర్‌లో రూ.68,000 కోట్లతో విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. అలాగే ఐఐఎం సంబల్‌పూర్ శాశ్వత క్యాంపస్‌ని ప్రారంభించారు. క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఝార్సుగుడ ప్రధాన పోస్టాఫీసు వారసత్వ భవనాన్ని జాతికి అంకితం చేశారు. రూ.2,146 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. శైలశ్రీ ప్యాలెస్ నమూనాతో సంబల్‌పూర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులకు ఆయన పునాది రాయి వేశారు. 168 కిలోమీటర్ల దూరం సంబల్‌పూర్ – తాల్చేర్ డబ్లింగ్ రైల్వేలైన్, 21.7 కిలోమీటర్ల ఝర్తర్గా – సోన్‌పూర్ కొత్త రైల్వే లైన్ జాతికి అంకితం చేశారు. ఈ ప్రాంతంలోని రైలు ప్రయాణికులకు కనెక్టివిటీని మెరుగు పరిచేందుకు పూరీ – సోన్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రధానమంత్రి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. సంబల్‌పూర్‌లో పీఎం నరేంద్ర మోదీకి గవర్నర్ రఘుబర్ దాస్ స్వాగతం పలికారు. ఆయనతో పాటు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్‌లు ఉన్నారు.

రాష్ట్రంలో క్షీణిస్తున్న వాయు నాణ్యత

ప్రాంతం	ఏక్యూఐ
రౌర్కెలా	162
బర్సిల్	156
బ్రజ్‌రాజ్‌నగర్	129
నయాగడ్	124
బాలాసోర్	116
కెంజొహార్	116
భువనేశ్వర్	115
రాయ్‌రంగ్‌పూర్	107
కటక్	106

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల వాయు (గాలి) నాణ్యత క్రమంగా క్షీణిస్తోంది. శనివారం జారీ అయిన తాజా సమాచారం ప్రకారం రాష్ట్రంలో అంగుల్, బరిపద పట్టణాల్లో వాయు నాణ్యత సూచిక (ఏక్యూఐ) బలహీన స్థాయికి దిగజారింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) జారీ చేసిన సమాచారం ప్రకారం అంగుల్ ప్రాంతంలో గాలి నాణ్యత విలువ 232 పాయింట్లకు దిగజారింది. దీని తదుపరి స్థానంలో 228 ఇండెక్స్ విలువతో బరిపదలో వాయు కాలుష్య పరిస్థితి కలవరపరుస్తుంది. ప్రముఖ ప్రాంతాల్లో వాయు నాణ్యత విలువలు పరిశీలిస్తే...

'రథసప్తమి వైభవంగా నిర్వహించాలి'


రథసప్తమి ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, పక్కనే పాలకమండలి సభ్యులు

అరసవల్లి: రథసప్తమి మహోత్సవాన్ని ఈ నెల 16న అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి క్షేత్రంలో ఘనంగా నిర్వహించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించారు. ఈమేరకు రథసప్తమి ఉత్సవ కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను ఆలయ పాలకమండలి సభ్యులతో కలిసి ఆయన శనివారం ఉదయం ఆవిష్కరించారు. ఆయన ముందుగా స్వామిని దర్శించుకుని రథ సప్తమి ఏర్పాట్లపై ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదన్నారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేస్తానన్నారు. దాతలకు, వీవీపీలకు కూడా పక్కాగా దర్శన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధ, ఎన్.కోటేశ్వర చౌదరి, దుక్క గనిరాజు, ఎల్.గోవిందరావు, జి.శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ, స్థానిక డివిజన్ ఇన్‌ఛార్జి గంగు సీతాపతి, పార్టీ నేతలు ద్వారపు అజిత్‌కుమార్ తదితరులున్నారు.

తహసీల్దార్ రమణయ్యకు అశ్రు నివాళి

- తహసీల్దార్ రమణయ్య హత్యతో జిల్లాలో విషాద ఛాయలు
- స్వగ్రామం దిమిలాడలో అంత్యక్రియలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని రెవెన్యూ సిబ్బంది డిమాండ్


రమణయ్య అంతిమయాత్రలో పాల్గొన్న పేరాడ తిలక్

నందిగాం, నరసన్నపేట, శ్రీకాకుళం పాత బస్టాండ్: విశాఖపట్నం కొమ్మాదిలో శుక్రవారం రాత్రి జరిగిన హత్యలో నందిగాం మండలం దిమిలాడకు చెందిన తహసీల్దారు సనపల రమణయ్య(41) మృతి చెందడంతో జిల్లాలో విషాద ఛాయలు అలముకున్నాయి. దిమిలాడతో పాటు ఆయన భార్య స్వగ్రామం ఉర్లాం కూడా శోకసంద్రంలో మునిగిపోయింది. శనివారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామం దిమిలాడలో జరిగాయి.

దిమిలాడకు చెందిన సనపల రంగారావు, శకుంతలమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు రోహిణీరావు ఉపాధ్యాయుడు కాగా చిన్న కుమారుడు రమణయ్య తహసీల్దార్. రమణయ్య 7వ తరగతి చదువుతున్నప్పుడే తండ్రి రంగారావు కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందగా తల్లి ఇద్దరు కుమారులను వ్యవసాయ పనులు చేస్తూ చదివించారు. రమణయ్య 2011లో గ్రూప్–2కు ఎంపికై డిప్యూటీ తహసీల్దారుగా శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలిలో విధుల్లో చేరారు. ఆ తర్వాత అడ్‌హాక్ ప్రమోషన్లలో భాగంగా తహసీల్దారుగా పదోన్నతి పొంది జిల్లాలో వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, లావేరు, విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఏడాది తర్వాత చిన్నగదిలిలో తహసీల్దారుగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా బంటుపల్లి మండల తహసీల్దారుగా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అంతలోనే ఆయన హత్య జరిగింది. మృతునికి భార్య అనూష, కుమార్తె సహస్ర(7), కుమారుడు కృష్ణరంగ(3) ఉన్నారు.

శనివారం సాయంత్రం విశాఖపట్నం నుంచి స్వగ్రామానికి రమణయ్య భౌతిక కాయం చేరుకుంది. మండలం నలుమూలల నుంచి జనం ఆయనకు నివాళులర్పించేందుకు పోటెత్తారు. తల్లి శకుంతలమ్మ కుమారుడి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. భార్య అనూషతో పాటు పిల్లల రోదన చూసి స్థానికులు కూడా కంటతడిపెట్టారు. భారీగా వచ్చిన జనం మధ్య ఆయన అంతిమ యాత్ర జరిగింది. సోదరుడు రోహిణీరావు తలకొరివి పెట్టారు. ఈ శవయాత్రలో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మాజీ ఎంపీపీ యర్ర చక్రవర్తి, నాయకులు జోల జగన్, అంబోడి విష్ణు,కోత మధుసూదనరావు, పినకాన అజయ్‌కుమార్, మళ్ల బాలకృష్ణ, పలు మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు సంతాపం..

రమణయ్య హత్య గురించి తెలిసిన వెంటనే నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీ, వైసీపీ నాయకులు చింతు రామారావు, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ హత్యను వీఆర్వోల సంఘం, జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం ఖండించాయి. హత్యకు నిరసనగా శనివారం జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించామని సంఘం అధ్యక్షుడు కె.శ్రీరాములు, బీవీవీ రాజు, జీవీఎల్ శ్రీనివాసరావు, తదితరులు తెలిపారు. తహసీల్దార్ సనపల రమణయ్యపై దాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు పేర్కొన్నారు.

మగ్గం వర్క్‌తో ఉపాధి

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలో గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచిత మగ్గం వర్క్ 30 రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని సంస్థ డైరెక్టర్ కల్హారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సదుపాయాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మగ్గం వర్క్ నేర్చుకోవాలనుకున్న వారు నేరుగా సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9553410809, 7993340407 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సరిహద్దులో గేటు ఏర్పాటు

పాతపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర సరిహద్దు పాతపట్నం చెక్‌పోస్ట్‌లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని సీఐ ఎన్.సాయి తెలిపారు. శనివారం పాతపట్నం ఆర్టీసీ సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద గేటు ఏర్పాటు చేశారు. ఒడిశా, ఆంధ్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బిల్లులు లేకుండా తరలిస్తున్న నగదు, బంగారం, వెండి ఆభరణాలు, అనధికార మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయనున్నారు.

కానిస్టేబుల్‌కు బదిలీ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సూర్యమహల్ సమీప హోటల్ యజమానితో గురువారం రాత్రి మద్యం మత్తులో గొడవ పడిన రూరల్ కానిస్టేబుల్‌కు శుక్రవారం రాత్రికి రాత్రే బదిలీ చేశారు. ఎస్పీ జీఆర్ రాధిక విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక పోలీసు విభాగంతో విచారణ చేయించడంతో పాటు కానిస్టేబుల్ గోపిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా శుక్రవారం రాత్రి సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

అయోధ్య-కాశీ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

- 18న శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి బయల్దేరనున్న బస్సు
- పది రోజుల పాటు యాత్ర
- సూపర్‌లగ్జరీ బస్సుకు ఒక్కొక్కరికి ప్రయాణ చార్జీ రూ.12వేలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అయోధ్య–కాశీ యాత్రకు ప్రత్యేక బస్సు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. అందులో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ అయోధ్య–కాశీ యాత్ర పేరిట వివిధ పుణ్యక్షేత్రాలను 10 రోజుల్లో దర్శించుకునేలా టూర్ ప్లాన్ చేశారు. ఇందుకోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ రూపొందించింది.


అయోధ్య–కాశీ యాత్రకు ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి ప్రత్యేక బస్సు నడవనుంది. ఈ యాత్ర 10 రోజులపాటు కొనసాగనుంది. ముందుగా పూరి–జగన్నాథ క్షేత్రం, కోణార్క్– సూర్య దేవాలయం, భువనేశ్వర్ –లింగరాజుదేవాలయం, జాజిపూర్–గిరిజాదేవి శక్తిపీఠం, గయ–మాంగల్య గౌరి శక్తిపీఠం, శిరోగయ–విష్ణుమూర్తి పాదములు, బుద్ధగయ–బోధి వృక్షం, కాశీక్షేత్రం–విశ్వనాథ జ్యోతిర్లింగ దర్శనం, కాశీ విశాలాక్షి శక్తిపీఠం, కాశీ అన్నపూర్ణ దర్శనం, అన్నపూర్ణాదేవి బంగారుచీర దర్శనం, కాలభైరవుడు, ఢుండి గణపతి, బింధు మాధవుడు, తిలబండేశ్వర్, వారాహిమాత ప్రభాత దర్శనం, సంకట విమోచన హనుమాన్, తులసీ మానస మందిరం, దుర్గామాత వ్యాస కాశీ, మణికర్ణిక ఘాట్, మధ్యాహ్నం స్నానం, సీతామఢి–సీతాదేవి భూగర్భప్రదేశం, ప్రయాగ(అలహాబాద్)–గంగా, యమున, సరస్వతి నదుల సంగమం, త్రివేణీ సంగమ స్నానం, మాధవేశ్వరీ శక్తి పీఠం, హనుమంతుడి గుడి, అయోధ్య–రామజన్మభూమి, సరయూ నదీ స్నానం, రుద్రావర్తము, లలితాదేవి శక్తిపీఠం, బడేహనుమాన్ మందిరం, దధీచి మహర్షి ఆశ్రమం, నైమిశారణ్యంలో సత్యనారాయణవ్రతం ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

భోజనంతో పాటు..

అయోధ్య–కాశీ సంపూర్ణ యాత్రకు ఏపీఎస్ ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సు నడవనుంది. మనిషి ఒక్కొక్కరికి ప్రయాణ చార్జీ రూ.12వేలుగా నిర్ణయించారు. ఈ యాత్రలో 10రోజుల పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌ను ఆర్టీసీయే సమకూరుస్తుంది.

కాశీలో రూమ్ అకామిడేషన్, పడవ ప్రయాణ ఖర్చులు మాత్రం యాత్రికులే భరించుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 7382921647, 7382919694, 7382919696, 9959225608 నంబర్లకు సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

వినియోగించుకోండి



హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరామున్ని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. అయోధ్య–కాశీ తో పాటు మరికొన్ని పుణ్య క్షేత్రాలను కూడా దర్శించుకోవచ్చు.

– ఎ.విజయ్‌కుమార్, ఆర్టీసీ డీపీటీఓ

క్లుప్తంగా

వెయిట లిఫ్టింగ్ పోటీల్లో కొండపల్లి ప్రతిభ


రజత పతకం సాధించిన గౌరి బాబు

నెల్లిమర్ల రూరల్: మహారాష్ట్రలో గత నెల 30 నుంచి జరుగుతున్న అఖిల భారత తపాలా శాఖ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన క్రీడాకారుడు కొండపల్లి గౌరిబాబు ప్రతిభ కనబరిచాడు. 61 కిలోల విభాగంలో పోటీల్లో పాల్గొన్న గౌరిబాబు రజత పతకం కైవసం చేసుకున్నాడు. గౌరిబాబుకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పాలకొండ ఆర్డీఓగా వెంకటరమణ


బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ వెంకటరమణను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

పాలకొండ: పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారిగా వి.వెంకటరమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఆర్డీఓ లావణ్య శ్రీకాకుళం ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ అయింది. ఆమె స్థానంలో అల్లూరి జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న వెంకటరమణను ఇక్కడ ఆర్డీఓగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కిరణ్


గురుగుబిల్లి కిరణ్ కుమార్

సంతకవిటి: డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ వార్డు సచివాలయ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గురుగుబిల్లి కిరణ్‌కుమార్‌ను నియమించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోషఫ్ కిషోర్ శనివారం వెల్లడించారు. రాష్ట్రంలో అసోసియేషన్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే విజయనగరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ సేవలు వినియోగించుకోవడం ఎంతో అవసరం అని గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టుని తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై మరింత బాధ్యతగా పని చేస్తానని పేర్కొన్నారు.

చెరకు లారీ బోల్తా


సంకిలి వద్ద బోల్తా పడిన లారీ

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద పాలకొండ నుంచి సంకిలి ఫ్యాక్టరీ వైపు వస్తున్న లారీ శనివారం బోల్తా పడింది. చెరకును తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. లారీ డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న క్లీనర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు బోల్తా పడిన లారీ నుంచి చెరకును వేరే లారీలోకి లోడ్ చేసి, లారీని ప్రమాద స్థలం నుంచి బయటకు తీయించారు.

తొడుము సమీపంలో గజరాజుల గుంపు


తొడుము సమీపంలో సంచరిస్తున్న గజరాజులు

కొమరాడ: మండలంలోని ప్రజలకు గజరాజుల బెడద వీడడం లేదు. ఇటీవల వన్నాం, కిల్డాడ తదితర గ్రామాల్లో సంచరించిన ఏడు ఏనుగుల గుంపు కోడల గుంపు, తొముడు సమీపంలో శనివారం సంచరించినట్టు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. సీమనాయుడువలస కూడలి నుంచి తొడుము వెళ్లే రహదారిపై ప్రయాణించే వారు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిబ్బంది సూచించారు. రాత్రిపూట రైతులు పొలాల్లోకి వెళ్లొద్దని హెచ్చరించారు. జొన్న, టమాట తదితర పంటలు చేతికందొచ్చే సమయంలో ఏనుగుల వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజరాజుల గుంపును ఇక్కడ నుంచి తరలించే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విజయనగరం రూరల్: జిల్లాలోని దుకాణాలు, సంస్థలకు ఈ నెల 29 లోగా రిజిస్ట్రేషన్, లైసెన్స్ పునరుద్ధరణ చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని దుకాణాలు, సంస్థల్లో ప్రదర్శించాలన్నారు.

ప్రజారోగ్యమే మహాభాగ్యం

- ప్రభుత్వ చర్యలతో అదుపులో బీపీ, షుగర్
- ఫ్యామిలీ డాక్టర్, జగనన్న సురక్ష శిబిరాల ద్వారా రోగుల గుర్తింపు
- జిల్లాలో ఏడాదిలో 88,008 మంది బీపీ రోగుల గుర్తింపు
- 73,759 మంది షుగర్ రోగులకు చికిత్స
- ఉచితంగా మందుల సరఫరా


భోగాపురం మండలంలో రోగి ఇంటి వద్దకు వెళ్లి బీపీ చెక్ చేస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్‌తో బాధపడే రోగుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. బీపీ, షుగర్ వ్యాధిని గుర్తించడంతో పాటు వ్యాధిని అదుపులో ఉంచడానికి అవసరమైన చికిత్సను అందిస్తోంది. ఆస్పత్రులకు రాలేని వారికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లి వైద్య సిబ్బంది గుర్తిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి అసంక్రమణ వ్యాధుల నివారణ కేంద్రం (ఎన్‌సీడీ) క్లినిక్‌ల్లో కూడా రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. మారిన జీవన విధానంలో అధిక శాతం మంది శారీరక వ్యాయమానికి దూరం అవుతున్నారు. ఎక్కువగా కంప్యూటర్లు, టీవీలు ముందు కూర్చుంటున్నారు. దీని వల్ల బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన పడుతున్నారు. వ్యవసాయం చేసే రైతులు తప్ప మిగిలిన ప్రజలు శారీరక శ్రమకు నోచుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతం కంటే పట్టణ ప్రాంత ప్రజలు జంక్ ఫుడ్స్, అధిక కొవ్వుతో కూడుకున్న ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల, బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడుతున్నారు.

గ్రామ స్థాయిలోనే రోగుల గుర్తింపు

బీపీ, షుగర్ వ్యాధి నిర్ధారణ కోసం గతంలో పీహెచ్‌సీకిగాని, జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికిగాని వెళ్లాల్సిన పరిస్థితి. ప్రభుత్వ ఆస్పత్రిలో అయితే ఉచితంగా సేవలు అందేవి. ప్రైవేటు ఆస్పత్రి అయితే చేతి చమురు వదిలించుకోవాల్సి వచ్చేది. కాని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వం వ్యాధి నిర్ధారణతో చికిత్స కూడా రోగులకు పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. ముఖ్యంగా గ్రామ స్థాయిలోనే వ్యాధి నిర్ధారణ అవుతుంది. ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి రోజు గ్రామాల్లో వైద్య శిబిరాలు పెట్టి అక్కడకు వచ్చే రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారు. బీపీ, షుగర్ నిర్ధారణ అయిన వారికి నెలకు సరిపడ మందులు అందజేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం గత ఏడాది చేపట్టింది. జిల్లాలో ఉన్న అన్ని సచివాలయాల పరిధిలో మెగా వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలతో పాటు చికిత్స అందించింది. ప్రస్తుతం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జిల్లాలో నిర్వహిస్తున్నారు. వారంలో రెండు రోజుల పాటు శిబిరాలు నిర్వహిస్తున్నారు.


రోగికి షుగర్ పరీక్ష చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

ఉచితంగా చికిత్స

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోను, ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలు వద్ద ఉచితంగా ప్రభుత్వం సేవలు అందిస్తోంది. అవసరమైన మందులు కూడా అందిస్తుంది. వ్యాధి అదుపులో ఉండే విధంగా నిరంతరం వారిని పర్యవేక్షణ చేస్తున్నాం.
– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

ఏడాదిలో..

ఏడాదిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోను, ఫ్యామిలీ డాక్టర్ శిబిరాల్లో వైద్య సిబ్బంది వేలాది మంది బీపీ, షుగర్ రోగులకు చికిత్స అందించారు. 2023 జనవరి నుంచి డిసెంబర్ 2023 వరకు 88,008 మంది బీపీ రోగులకు చికిత్స అందించారు. 73,759 మంది షుగర్ రోగులకు చికిత్స అందించారు. ఏడాదిలో 1,72,067 మందిని పరీక్షించగా అందులో 12,553 మందికి కొత్తగా బీపీ నిర్ధారణ అయింది. 1,37,398 మందికి షుగర్ పరీక్షలు చేయగా అందులో 11,089 మందికి షుగర్ ఉన్నట్టు నిర్ధారణ అయింది.

వ్యాధుల వ్యాప్తి ఇలా..

నూడిల్స్, చాట్, పానీ పూరి వంటి జంక్ ఫుడ్స్ తినడం వల్ల, టీవీ అధికంగా చూడడం వల్ల బీపీ, షుగర్ వంటి వ్యాధులు వస్తున్నాయి. శారీరక వ్యాయమం లేకపోవడం, ఒకే చోట 8 నుంచి 12 గంటల పాటు పని చేయడం, మానసిక ఒత్తిడి, సంఘర్షణ, ఆత్మన్యూనత, పొగ తాగడం, ఆల్కహాల్ సేవించడం వంటి వాటి వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.

అదుపులోనే బీపీ



మా గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం నిర్వహించినప్పుడు తల తిరుగుతుందని వెళ్లాను. అక్కడ డాక్టర్ నన్ను పరీక్షించి బీపీ ఉందని, మందులు వాడాలని చెప్పారు. ఏడాది క్రితం నాకు బీపీ ఉందని నిర్ధారణ అయింది. అప్పటి నుంచి ప్రతి నెల ఉచితంగా మందులు ఇస్తున్నారు. ప్రస్తుతం నాకు బీపీ అదుపులోనే ఉంది.
– వందక సూర్యనారాయణ, నవరపల్లి గ్రామం

ప్రతి నెల పరీక్షిస్తున్నారు..



ప్రతి నెల మా ఊరికి మందుల బండి వస్తుంది. అక్కడకు రెండు సంవత్సరాలుగా వెళ్తున్నాను. షుగర్ పరీక్ష చేసి నాకు మందులు ఉచితంగా ఇస్తున్నారు. డాక్టర్ దగ్గరకు వెళ్లినప్పుడు ఎటువంటి ఆహారం తీసుకోవాలి, మందులు ఏ విధంగా వేసుకోవాలో చెబుతున్నారు.
– బీవర నారాయణమ్మ, రాజపులోవ

క్రీడోత్సాహం..

- చివరి రోజు ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలు
- విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాల అందజేత
- ప్రథమ స్థానం దక్కించుకున్న జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు


మహిళల విభాగంలో బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎస్.కోట నియోజకవర్గ క్రీడాకారిణులు


స్త్రీల క్రికెట్‌లో విజేతలుగా నిలిచిన గజపతినగరం జట్టు


స్త్రీల కబడ్డీలో విజేతలుగా నిలిచిన నెల్లిమర్ల జట్టు


స్త్రీల ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలిచిన చీపురుపల్లి జట్టు


స్త్రీల వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన చీపురుపల్లి జట్టు

విజయనగరం: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీల్లో క్రీడోత్సాహం వెల్లివిరిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నగదు ప్రోత్సాహకాలతో పాటు మెడల్స్, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేయటంతో పోటీల్లో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. చివరి రోజు శనివారం పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. సాంకేతిక కారణాల రీత్యా పురుషుల కబడ్డీ ఫైనల్స్ నిలిచిపోగా... వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడాంశాల్లో విజేతలకు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుత్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వి.రమణ, వివిధ నియోజకవర్గాలకు చెందిన ఇన్‌చార్జిలు విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో గజపతినగరం, విజయనగరం, బొబ్బిలి జట్లు విజేతలుగా నిలవగా... మహిళల విభాగంలో ఎస్.కోట, సాలూరు, గజపతినగరం జట్లు విజేతలుగా నిలిచాయి. ఖోఖో క్రీడాంశంలో పురుషుల విభాగంలో చీపురుపల్లి, గజపతినగరం, విజయనగరం నియోజకవర్గ జట్లు....మహిళల విభాగంలో చీపురుపల్లి, గజపతినగరం, విజయనగరం జట్లు విజేతలుగా నిలిచారు. వాలీబాల్ క్రీడాంశంలో పురుషుల విభాగంలో బొబ్బిలి, ఎస్.కోట, విజయనగరం నియోజకవర్గాల జట్లు... మహిళల విభాగంలో చీపురుపల్లి, ఎస్.కోట, విజయనగరం నియోజకవర్గ జట్లు ప్రథమ, ద్వితీయ , తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో స్త్రీ, పురుషుల విభాగాల్లో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన మొదటి మూడు జట్లకు రూ.60,000, రూ.30,000, రూ.10వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను నేరుగా ఆయా క్రీడాకారుల ఖాతాల్లో జమ చేయగా.... . బ్యాడ్మింటన్ పోటీల్లో స్త్రీ, పురుషుల విభాగాల్లో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన మొదటి మూడు జట్లకు రూ.35,000, రూ.20,000, రూ.10,000 జమ చేశామన్నారు. జిల్లా స్థాయిలో జరిగిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా ఐదు క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ తెలిపారు. క్రీడాకారులు ఉత్తమ క్రీడా ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలతో సెంచూరియన్ ఎంఓయూ


పరస్పర అవగాహన పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలతో టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయం శనివారం ఎంఓయూ కుదుర్చుకుంది. వర్సిటీ తరఫున వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధాన అధ్యాపకురాలు పద్మలీలతో కలిసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఓయూ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బీఎస్సీ నర్సింగ్, అనస్థషియా, రేడియాలజీ చదువుతున్న విద్యార్థులకు క్లినికల్ ప్రాక్టీస్, ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టులు, పరిశోధనలు చేసుకునేందుకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో పారామెడికల్ డీన్ ఎంఎల్‌ఎస్ ఆచార్యులు, డాక్టర్ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్యపై రెవెన్యూ ఉద్యోగుల నిరసన


కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ ఉద్యోగుల నిరసనలు

విజయనగరం అర్బన్: బొండపల్లి తహసీల్దార్ సనపల రమణయ్య హత్యను రెవెన్యూ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా పని చేసిన రమణయ్య ఎన్నికల బదిలీల్లో భాగంగా శుక్రవారమే జిల్లాలో బొండపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇంతలోనే ఆయన హత్యకు గురవడంతో కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులపై దాడులను అరికట్టాలని, స్వేచ్ఛగా పని చేసేందుకు తగిన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భద్రత కోసం తగిన చట్టాలను రూపొందించాలని కోరారు. అంతకు ముందు రమణయ్య మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.సూర్య, ఇతర నాయకులు, డివిజన్ నాయకులు, కలెక్టరేట్ యూనిట్ నాయకులు, సర్వే శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.


ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్


లెండీ కళాశాలలోని సౌకర్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టేందుకు అనువైన కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ నాగలక్ష్మి, ఇతర అధికారులు శనివారం పలు ప్రభుత్వ, ప్రైవేటు భవనాలను పరిశీలించారు. దీనిలో భాగంలో స్థానిక పోలీసు శిక్షణా కళాశాల, డెంకాడ మండలంలోని లెండి కళాశాల, నెల్లిమర్ల మండలంలోని సెంచూరియన్ యూనివర్సిటీలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని భవనాలు, వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను పరిశీలించడంతో పాటు, రహదారి సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయా కేంద్రాల్లోని భవనాలు, వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను పరిశీలించడంతో పాటు, రహదారి సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. స్ట్రాంగ్ రూములు, వాటికి సమీపంలోనే లెక్కింపు చేపట్టేందుకు అనువుగా ఉన్న భవనాలను గుర్తించాలని ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్డీఓ ఎంవీ సూర్యకళ, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొండడాబాల యాత్ర ప్రారంభం


వైభవంగా ప్రారంభమైన వ్యాకులమాత యాత్ర


జ్ఞానాపురం నుంచి వ్యాకులమాతతో పాదయాత్రగా వస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని కొండడాబాల వ్యాకుల మాత యాత్ర శనివారం ప్రారంభమైంది. విశాఖపట్నం జిల్లా జ్ఞానాపురం నుంచి వేలాది మంది భక్తులు పాదయాత్రగా కొండడాబాలకు చేరుకున్నారు. కనికర మాతను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై తిరువీధిగా తీసుకొచ్చారు. నవదిన పూజలు ముగిశాయని, ఆదివారం రాత్రితో యాత్ర ముగుస్తుందని విచారణ కర్త గొంగాడ రాజు తెలిపారు. యాత్రను సజావుగా నిర్వహించేందుకు డీఎస్పీ గోవిందరావు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 18 మంది ఎస్‌ఐలు, 230 మంది సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్‌కు

మనస్తాపంతో యువకుడి మృతి

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామానికి చెందిన కొచ్చెర్ల మోహన్‌సాయి (24) అనే యువకుడు కుటుంబంలో జరిగిన పరిణామాలతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు.. మోహన్‌సాయి వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది కాలంగా ఆ పని కూడా చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో శుక్రవారం రాత్రి తన పల్సర్ బైక్‌పై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెదికారు. ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం గ్రామానికి సమీపంలో ఉన్న మృతుడి చిన్నాన్నకు చెందిన మామిడి తోటలో చీరతో చెట్టు కొమ్మకు ఉరి వేసుకొని ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ గోపాలరావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య పద్మ, ఏడాది వయసు గల బాబు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బొబ్బిలి: పట్టణంలోని శ్రీ సూర్య రెసిడెన్సీలో ఒడిశాకు చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్టు లాడ్జి సిబ్బంది, పోలీసులు కనుగొన్నారు. ఎస్‌ఐ వదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్‌కు చెందిన ఇందుభూషణ్ పాత్రో(65) ఈ నెల 1న సాయంత్రం రెసిడెన్సీలోని 204 నంబరు గల గది తీసుకున్నాడు. అప్పటి నుంచి బయటకు రాలేదని సిబ్బంది ద్వారా గుర్తించారు. గ్రోత్ సెంటర్‌లోని మిన్‌ప్లాప్ కంపెనీలో ఓ పరికరాన్ని బాగు చేసేందుకు వచ్చినట్టు ప్రాథమికంగా గుర్తించారు. అయితే పాత్రోది ఆత్మహత్యా, హత్యా, గుండె పోటా అన్నది తెలుసుకునేందుకు పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఏటులాటలపై పోలీసుల దాడి

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామం సమీపంలో రహస్యంగా సాగిస్తున్న ఏటులాట (నాణేల ఆటలు)పై సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. ఆట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.28,080లు నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఆటలకు వినియోగించిన రెండు నాణేలను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రయోగ పరీక్షలకు వేళాయె


పట్టణంలోని ఒక వృత్తి కళాశాల ప్రయోగ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈసీ కమిటీ బృందం

- రేపటి నుంచి 20వ తేదీ వరకు 6,862 మంది వృత్తివిద్య కోర్సుల అభ్యర్థులకు..
- 11 నుంచి 20వ తేదీ వరకు 15,217 మంది జనరల్ కోర్సుల అభ్యర్థులకు ప్రయోగ పరీక్షలు
- నాన్ జంబ్లింగ్ విధానంలో నిర్వహణ
- మొత్తం 143 పరీక్ష కేంద్రాల ఎంపిక
- పక్కా ఏర్పాట్లు చేసిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ సెకెండియర్ విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ నుంచి నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. దీనికోసం ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల నిఘా నడుమ పరీక్షలు నిర్వహిస్తారు. కెమెరాల సాయంతో పరీక్ష కేంద్రాలను రాష్ట్రస్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. విద్యార్థులు వారివారి కళాశాలల్లోనే ప్రయోగ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రైవేటు కళాశాలల్లో పరీక్షల పర్యవేక్షణకు జూనియర్ లెక్చరర్‌స్థాయి అధికారి ఛీఫ్ ఎగ్జామినర్‌గా, సబ్జెక్టు వారీగా మరో అధ్యాపకుడును నియమించారు. పరీక్షల పర్యవేక్షణలో ప్రైవేటు పెత్తనానికి చెక్ చెప్పారు. పరీక్ష పత్రాలు అరగంట ముందు ఆన్‌లైన్‌లో పెడతారు.

పరీక్షల నిర్వహణ ఇలా...

వృత్తివిద్యా కోర్సుల అభ్యర్థులకు ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలోని 6,862 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 45 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి.

- ఇంటర్మీడియట్ జనరల్ కోర్సుల అభ్యర్థులకు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. సెకెండియర్ ఎంపీసీ చదువుతున్న 10,760 మంది ఫిజిక్స్, కెమిస్ట్రీ, బైపీసీ చదువుతున్న 4,457 మంది విద్యార్థులు కెమిస్ట్రీ, బయాలజీ, జువాలజీ సబ్జెక్టుల ప్రయోగ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరికోసం జిల్లాలో 98 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం 148 పరీక్షల కేంద్రాల్లో 572 సీసీ కెమెరాలను అమర్చారు. వీటిని రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కార్యాలయానికి అనుసంధానం చేశారు.

పరీక్షల పర్యవేక్షణకు డీఈసీ కమిటీ

పరీక్షల పర్యవేక్షణకు జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)ని ఏర్పాటు చేశారు. ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీకి గుర్ల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ కో-కన్వీనర్‌గా, మరో ముగ్గురు సబ్జెక్టు అధ్యాపకులు సభ్యులుగా ఉంటారు. కలెక్టర్ నాగలక్ష్మి కన్వీనర్‌గా ఉండే హైపవర్ కమిటీకి డీఈసీ కమిటీ ప్రతినిధులు ఒకరు సభ్యులుగా ఉంటారు. స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వ్యవహరిస్తారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఒక అధికారి సబ్జెక్టు అధ్యాపకులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేస్తుంది.

గంట ముందు ఆన్‌లైన్‌లో పరీక్ష పత్రాలు

ప్రయోగ పరీక్ష కోసం రూపొందించిన ప్రశ్న పత్రాలు ఆన్‌లైన్‌లో పరీక్ష సమయానికి గంటముందు విడుదల చేస్తారు. సంబంధిత పరీక్ష కేంద్రం చీఫ్ ఎగ్జామినర్ వద్ద ఉన్న పాస్‌వర్డ్ ద్వారా ఒక గంట ముందు మాత్రమే డౌన్‌లోడ్ అవుతాయి.

పక్కాగా ఏర్పాట్లు



ప్రయోగ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ల్యాబ్‌ల పరిశీలన పూర్తయింది. ఈ ఏడాది కూడా ఆన్‌లైన్ ప్రశ్న పత్రాల విధానాన్ని అమలు చేస్తున్నాం. సీసీ కెమెరాలను ఈ ఏడాది తొలిసారిగా రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ అధికారులకు అనుసంధానం చేశాం. పరీక్షలు సజావుగా నిర్వహణకు జిల్లా స్థాయి పరీక్షల కమిటీ (డీఈసీ), హైపవర్ కమిటీలు పనిచేస్తాయి.
– మజ్జి ఆదినారాయణ, ఆర్ఐఓ